

శ్రీమతి ఉమాశశి

# వివాహవైరాగ్యం

★

వైరాగ్యాలు మూడు రకాలంటారు. స్మశాన వైరాగ్యం, ప్రసూతి వైరాగ్యం, పురాణ వైరాగ్యం. ఈ వైరాగ్యాలన్నీ కొంతకాలం వరకు మాత్రమే మనిషిపై తమ ప్రభావాన్ని చూపుతాయి. అయితే ఈ నాలుగో రకం వైరాగ్యమేమిటి? దీని ప్రభావం ఎవరిపై ఎలావుంటుంది? తెలుసుకునేందుకు ఇహ కథలోకి కదలండి—

ఏమిటది? ఎదురుగా నేలమీద? ఆ కనిపిస్తున్నదేమిటది? ఇన్‌లాండ్ ఉత్తరంలా ఉంది. ఆగాను నేను. నిజమే ఎవరిదో పారేసుకున్నట్లున్నారు. వంగి అందుకున్నాను. ఉత్తరం పెద్దదిలాగుంది. ఎవరో...ఎవరికో రాశారు. ఎందులోనో పెట్టుకుంటే, పుస్తకంలోనో, జేబులోనో...జారిపోయుంటుంది, తేదీచూశాను ఎప్పటిదో! అబ్బో...ఏడాదైపోయింది. చదువుదాం. తప్పేముంది? కానీ...ఇప్పుడెలా. చుట్టూ ఇందరుండగా...అసలే బజారు ఉహూ...ఇక్కడకాదు...ఇక్కడకాదు. ఇంటికెళ్ళి తీరిగ్గా చదవాలి. పెద్ద ఉత్తరమే. ఎవరో మహానుభావులు. మరీ ఇరికించి ఇరికించి అయిదు పేజీలుపట్టే విషయాన్ని చక్కగా ఇన్‌లాండ్‌లో ఇరికించారు. అబ్బ...ప్రేమలేఖ కాదుకదా. గుండెలు దడదడ...ఉత్సాహం ఉరకలువేసింది. అబ్బే... ప్రేమలేఖయితే ఇలా, ఇంత అజాగ్రత్తగా పారేసుకుంటారా? అయినా చూద్దాం, మెల్లగావిప్పాను 'నాన్న' సంబోధన...హతోస్మి ... ప్రేమలేఖకాదు. తండ్రిగారికిరాశారెవరో...తనయుడు డబ్బు పంపమని రాసిఉంటాడు. అంతకంటె ఏంపని ఈనాటి కుర్రాళ్ళకి. డబ్బుకావలిసినప్పుడే తండ్రి గుర్తురావడం...అయినా కొడుకే రాశాడని ఎందుకనుకోవాలి. కూతురయి వుండొచ్చుగా! అవును...కింద సంతకంచూశాను. సరిసరి...అమ్మాయే తండ్రికి రాసింది ఆయన పాపం ఉత్తరంపారేసుకున్నాడు ఏంరాసిందో? చదవాలి.

గబ గబ ఇల్లుచేరుకున్నాను మొహం, కాళ్ళు చేతులు కడుక్కొని అమ్మ అందించిన కాఫీ ఒక్కగుక్కలో తాగేసి, డాబామీదకు పరిగెత్తాను ఉత్తరం తీసుకుని—

అడ్రసు చూశాను మళ్ళీ. ఈ ఊరుకాదు ఉత్తరంవిప్పాను. తేలిగ్గా పిట్టగోడనానుకుని చదవడం ప్రారంభించాను.

"నాన్న,

ఈ ఉత్తరం మీకు ఏడుస్తూరాస్తున్నాను నిన్న అక్క ఇంటికివెళ్ళాను ఆ వెధవ దాన్ని చంపేస్తాడు నాన్నా! ఇంటికి తీసుకుపొండి మీరు ఒళ్ళంతా వాతలు దానికి. దెబ్బలు తినడానికి కూడా ఓ హద్దూ పద్దూ ఉందని నా ఉద్దేశం. ఏమిటని అడిగితే నవ్వేసింది. ఇలా అక్కను చూస్తూవుంటే నేను చదువుకోలేను ఆ చదువు నా ఒంటబట్టదు.


అక్క అడిగింది హాస్టలు నుండి వచ్చి వాళ్ళింట్లో రెండురోజులుండమని' ఆ తోడేలు చూపులువాడూను, తాగుడుమైకంలోనే ఉంటాడెప్పుడు. వాడుంటే వాడి గడపతొక్కాలనిపించదు. మీరు రాశారు కాబట్టి వెళ్ళిచూసి పాతికరూపాయలు ఇచ్చివచ్చాను అక్కకి—

అస్థిపంజరంలావుందది. ఇంకా కొన్ని రోజులు అదక్కడేవుంటే దాని చావుకబురు మనకందుతుంది. దాని సంపాదన కూడా దానికి దక్కనివ్వనపుడది ఉద్యోగంచెయ్యడమెందుకు?

ఏదోఒకటి చెయ్యాలి నాన్నా! అదింక బతకదు. దాని పెళ్ళి దాని మెడ కురిత్రాడు. తిండి కూడా తినటంలేదని నా కనుమానం. కనీసం వాడుకొట్టేదెబ్బలయినా భరించేశక్తి వుండాలి కదా దానికి. అతగాడు కనుబాటవగానే అడిగాను వెళ్ళిపో అక్కా ఇంక ఇక్కడుండకు' ఏం మాట్లాడకుండా గుడ్లనీరు కుక్కుకుంది,

అది చచ్చిపోతుంది. ఏమాత్రం మీరు, ఇంకా మనవాళ్ళు, ఆలస్యంచేసినా అది మనకు దక్కదు. ఇరుగుపొరుగువాళ్ళు నానాగడ్డి పెట్టారు- అంతపిల్ల బరువైపోతే చిన్నప్పుడే చంపెయ్యలేకపోయావా? అని నిజమే అమ్మకూడా ఈ సంగతి చెప్పండి అత్తయ్య, మామయ్య మీరు—అందరూ ఆలోచించి ఓ నిశ్చయానికి త్వరగా రండి..."

అక్షరాలు మసక మసక అయ్యాయి బహుశ. ఆ అమ్మాయి ఏడుస్తూరాసుంటుంది. కంటి నీరుపడినందువల్ల అక్కడక్కడ చెరిగిన అక్ష




రాలు నాకు పూర్తికథ నే చెప్పాయి. అక్కను గురించి ఏం బాధపడుతోందా పిల్ల! ఎంతమనో వేదన కన్నీళ్ళు తుడుచుకుని మళ్ళీ ఉత్తరంవేపు చూశాను.

ఏదో కాలేజీకుర్రదాని ఉత్తరం పూర్తి చేసింది. ఆ ఉత్తరం చదివాక నా మనసు మనసులో లేదు.

ఉత్తరంరాసిన అమ్మాయిదీ ఈ ఊరుకాదు. అందుకున్న వ్యక్తికీ ఈ ఊరుకాదు. కానీ ఆ ఉత్తరం నాకు ఈ ఊర్లోనే దొరికింది. బహుశ యాత్రలుచేస్తూవుండొచ్చు ఆ తండ్రి. యాత్రలు చేసేవాళ్ళు విడవిడిగావడంలో విశేషంలేదు కానీ ఎప్పుడో ఏడాదిక్రితం కూతురురాసిన ఉత్తరాన్ని అతిభద్రంగా ఆయన దాచుకోడం చిత్రం. అది ఈనాడు బస్ స్టాండ్ లో ఆయన పారేసుకోవడం విచిత్రం. నాకా ఉత్తరం దొరకడం చిత్రాతిచిత్రం!

ఇంతకీ ఆ అమ్మాయి ఏమయిందో చెల్లెలు బాధపడినట్లే, భయపడినట్లే జరిగిందా? అందుకే ఆయన మనశ్శాంతికి యాత్రలుచేస్తున్నాడా? ఆ భావంరాగానే నా ఒళ్ళు ఒక్కసారే బాధతో బరువెక్కింది కళ్ళల్లో నీళ్ళు రాయి పాపం! పాపం నా మనసు ఆక్రోశించింది. ఉత్తరంలో సంగతులు నా మనసును కలిచివేశాయి.

ఎప్పుడూ తుళ్ళుతూ, నవ్వుతూ పేలుతూ వుండే నేను అతిముభావంగా వుండటం మా ఇంట్లోవాళ్ళు గమనించకపోలేదు ఎటుచూసినా ఎటు తిరిగినా నాకు ఆ ఉత్తరంలోని వ్యక్తులే తారసపడుతున్నారు. నా మనోయవనికమీద కథల్లో చదివిన, సినిమాలోచూస్తున్న వ్యక్తులు నిజజీవితంలోనూ వున్నారన్న నిజాన్ని ఆ ఉత్తరం నాకుచెప్పింది.

ఇంతవరకు ఎప్పుడేనా అలాంటి కథ ఏ పుస్తకంలోనైనా చదివినా, ఎవరైనాచెప్పినా "ఆ(...అంతా కథకుల ఊహాలు. అంతదుర్మార్గులు ప్రపంచంలో వుండరు," అంటూ తోసిపారేసి తేలిగ్గా చూసేదాన్ని. కానీ ఈఉత్తరం

నిజంగా జరగకపోతే కథలు మాత్రం ఎలా పుట్టాయి? ఆ అక్క, ఆమెను కొట్టేతాగుబోతు మొగుడు, ఆ అక్క పరిస్థితి చూసిమనో వ్యథను పొందే చెల్లెలు, ఆ ఉత్తరం అందుకున్నప్పుడా తండ్రి పడే బాధ, కన్నతల్లి కడుపుకోత... ఇవన్నీ ఆలోచిస్తూనేఉన్నాను. అంత చిన్న ఉత్తరం ఎంత కథని చెప్పింది: ఎన్నెన్నో అనుమానాలు. మరిన్ని ప్రశ్నలు సమాధానం ఎప్పటికీ దొరకని ప్రశ్నలు...

"ఏమిటాలోచిస్తున్నావ్ అంతగా? సాయంత్రంనుంచీ అలాగే వున్నావ్? ఏమిటావారు? నాకూ చెప్పు" అంది అక్క. ఆమె గొంతు విని ఉలిక్కి పడ్డాను. "ఎంతసేపయిందక్కా వచ్చావ్?"

"అయిదు నిముషాలయింది. నీలోనువ్వే ఏమిటా బాధ పడటం? నాకు చెప్పకూడదా? మవునంగా వుత్తరం అందించాను.

"ఏమిటే ఆ వుత్తరం?"

"చదువు, నీకే తెలుస్తుంది"

చదివింది.

"నాకేం అర్థంకాలేదు. ఎవరికీ ఉత్తరం? ఎవరు రాశారు? ఎక్కడినుంచెక్కడికి?" అంటూ ప్రశ్నలు. అవును మరి తలాతోకాలేని ఉత్తరం. ఏడాది క్రిందటి తారీఖు. ఆ పేర్లు గల వాళ్ళెవరూ మాకు తెలియదు. అందుకే అర్థంకాదు.

"బస్టాండ్‌లో దొరికిందక్కా సాయంత్రం సుమతికి కొండబస్ ఎక్కించి వచ్చేస్తుంటే దొరికింది"

"అహా... ఎవరిదోనన్న మాట"

అమ్మయ్యా, మనకి తెలిసిన వాళ్ళది కాదు కదా అన్నంత హాయి ఆ గొంతులో, మళ్ళా చదివింది.

"పాపం" అంది ఉత్తరం మడిచి నాకం దిస్తూ.

"నిజమే"

తాగుబోతు మొగుడు. ఆవిడ బాధ మామూలు కథే, అన్నిటికన్నా తమాషా వాడుకొట్టే దెబ్బలు భరించడానికయినా ఆవిడకి శక్తి ఉండాలికదా అంటూ ఆ చెల్లెలు బాధపడుతోంది. చూశావా లలిత" అంది బాధగా. నవ్వుతూ అక్క,

"తాగుబోతులు సంఘానికి చీడపురుగులు" అప్రయత్నంగా అన్నాను.

అక్క మొహం వివర్ణమైంది,

"మోతాదుగా తాగితే ఫర్వాలేదు కదే లల్లీ" అంది మెల్లగా. అతి మెల్లగా

అప్పటిగ్గానీ నా ట్యూబులైటు బుర్ర పని చెయ్యలేదు. నాలిక్కరుచుకున్నాను. అక్కకి సంబంధం కుదిరింది అతగాడు చాలా పెద్ద ఉద్యోగస్థుడు. అప్పుడప్పుడు కంపెనీకోసమని ఓ పెగ్గు పుచ్చుకుంటాడట. అదీ ఈ మధ్యే తెలిసింది. నిశ్చయించుకొనేటప్పుడు తెలీదు. అదిగాక ఇంట్లో చిన్నగాలి దుమారం రేగింది. అక్కను అందరూ శాంత పరిచారు. ఏదో "ఏదో ఓసారి కాస్త పుచ్చుకుంటే ఏం ఫర్వాలేదు "అంటూ అన్నయ్యా, నన్ను అందరూ సమాధాన పరిచారు నేను, అమ్మా తప్ప.

అక్క మనసు కలత పడింది బాగా కానీ ఆ తర్వాత సర్దుకుంది— "నిజమే తాగినంత మాత్రాన మనుషులు కాకపోతారా" అని

మళ్ళీ ఇప్పుడు...మళ్ళీ...గాయం రేగింది అక్కకా ఉత్తరం ఇచ్చి ఎంత పొరపాటు చేశాను. "అరరే" అనుకున్నాను.

అక్క అక్కడ నుంచి వెళ్ళిపోయింది ఆలోచించుకుంటూ.

మర్నాడు పెళ్ళివారి దగ్గరనుండి ఉత్తరం వచ్చింది పదిరోజుల్లో మంచి ముహూర్తాలున్నాయని. అది తప్పితే మరో ఆర్నెల్లదాకా ముహూర్తాలు లేవని తమవైపునుంచి ఎటువంటి ఆక్షేపణ, అభ్యంతరంలేవు పదిరోజుల్లో వున్న ముహూర్తానికి అంటూ.

"కానీ నాకుంది ఆర్నెల్ల తర్వాతున్న ముహూర్తమే పెట్టుకుందాం నాన్నా" అంది అక్క.

"అదేమిటమ్మా ! వాళ్ళు తొందర పడుతున్నారు. నిశ్చయం చేసుకున్న సంబంధం కదా మనకీ అభ్యంతరం లేదని అనుకున్నాం కదా" ఆశ్చర్యంగా అన్నారు నాన్న.

"కాదులే నాన్నా ఈ ముహూర్తానికి వద్దు ఆర్నెల్లవనీ" అంది మరోమాటకి అవకాశం ఇవ్వకుండా అక్కడ్నుంచెళ్ళి పోయింది.

"అలా ఎందుకు చేశావక్కా ?"

—అడిగానారాత్రి

"ఇంకా ఆ ఉత్తరం ప్రభావం నా మీద ఉంది లలితా" పసుపువి తిరుగుతున్న పంకా వేపు చూస్తూ అంది.

"దానికీ దీనికి సంబంధం యేమిటి ?మరో ఆర్నెల్లకైనా ఒప్పుకుంటున్నావు కదా ? మరి ఇప్పుడైతేమాత్రం ఏం పోయింది ?"

నవ్వేసింది అక్క.

"నీకు తెలియదు లలితా. మూడు రకాలైన వైరాగ్యాలున్నాయని. స్మశాన వైరాగ్యం. ప్రసూతి వైరాగ్యం. పురాణ వైరాగ్యం ఇప్పుడు నాలో వున్నది నాలుగోరకం. వివాహ వైరాగ్యం! పెళ్ళికి విముఖత వుందినాలో ప్రస్తుతం అది కొన్నాళ్ళే వుంటుంది. ఆ తర్వాత పోతుంది. అందుకే ఈ ఆర్నెల్ల గడువు. ఆ దొరికిన ఉత్తరం మూలంగా సంబంధాన్ని ఒదులుకో లేముకదా. ఒకరి జీవితం అలా అయిందని, అందరి జీవితాలూ అలాగే ఉంటాయనీ అనుకోలేం కదా. అందుకేసంబంధాన్ని ఒప్పుకుంటున్నాను. అందుకే గడువు. ఎవరి జీవితాలెలా వుంటాయో ఎవరికి తెలుసు !

ఎక్కువగా దాన్ని గురించి ఆలోచించకు లలితా పడుకో" అంది ప్రక్కకు తిరిగి పడుకుంటూ

అక్క ఆలోచన సబబుగావుందని అనిపించింది నాకు. అక్కచెప్పిన మాట "వివాహ వైరాగ్యం" అన్నమాట నాలో గింగురు మని కొయితం మీద కలం పెట్టేదాకా ఊరుకో నివ్వలేదు.

# క్షీర (అ)న్యాయం

ఈ గాజు సీసా
ఓ పాలసీసా

ఈ పాలగ్లాసు
ఓ గాజుగ్లాసు
ఈ గ్లాసుపాలు
ఓ సీసా పాలు

వెరసి—

ఆ గాజుగ్లాసు
ఈ సీసా గాజు

ఈ పాలు నీళ్ళే.

—వి. సు. రావు